అటు రిలయన్స్.. ఇటు టాటా

టైమ్స్ ప్రపంచ అత్యంత ప్రభావశీల సంస్థల్లో చోటు • సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కూ స్థానం

న్యూఢిల్లీ, మే 30: టైమ్స్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటిస్తున్న ప్రపంచంలోనే 100 అత్యంత ప్రభావశీల సంస్థల జాబితాలో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌లు చోటు దక్కించుకున్నాయి. ఈ ఏడాదికిగాను విడుదలైన ఈ లిస్టులో రిలయన్స్, టాటాలు.. టైటాన్ కేటగిరీలో స్థానం పొందాయి. రిలయన్స్‌కు ఈ గౌరవం దక్కడం ఇది రెండోసారి. 2021 జాబితాలోనూ ఉన్నది. కాగా, ఈ సందర్భంగా రిలయన్స్‌ను 'ఇండియా'స్ జాగర్‌నట్'గా టైమ్ అభివర్ణించడం గమనార్హం. అప్రతిహతంగా రిలయన్స్ అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నదని టైమ్స్ ప్రశంసించింది. కరోనా వ్యాక్సిన్‌ను తయారు చేసిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు పయనీర్ కేటగిరీలో చోటు లభించింది. ఈ లిస్టులో 100 కంపెనీలను మొత్తం 5 కేటగిరీల్లో విభజించగా.. లీడర్స్, డిస్రప్టర్స్, ఇన్నోవేటర్స్ విభాగాలూ ఉన్నాయి. ఇక 58 ఏండ్ల క్రితం టెక్స్‌టైల్, పాలిస్టర్ కంపెనీగా మొదలైన రిలయన్స్.. నేడు 200 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీగా నిలిచిందని టైమ్ పేర్కొన్నది. ఎనర్జీ, రిటైల్, టెలికం, ఇతరత్రా రంగాల్లో విస్తరించిందని తెలిపింది. అలాగే టాటా గ్రూప్ 1868లో మొదలవగా.. ఉప్పు నుంచి ఉక్కు వరకు అన్నీ ఉత్పత్తి చేస్తున్నది విదితమే. టాటా సంస్థలన్నిటి మార్కెట్ విలువ 365 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ఇది పొరుగు దేశం పాకిస్తాన్ జీడీపీ కన్నా ఎక్కువ కావడం గమనార్హం. ఇదిలావుంటే ఇది టైమ్స్ నాల్గో జాబితా. ప్రభావం, కొత్తదనం, లక్ష్యం, విజయాల ప్రాతిపదికన ఆయా సంస్థలకు లిస్టులో చోటు దక్కింది.

ఫోన్‌పే రుణాలు

న్యూఢిల్లీ, మే 30: ఫోన్‌పే కస్టమర్లు ఇకపై వివిధ రకాల రుణాలనూ పొందవచ్చు. గృహ, ఆటో, విద్యా, బంగారం, మ్యూచువల్ ఫండ్ లోన్లను అందిస్తున్నట్టు గురువారం సంస్థ ప్రకటించింది. ఈ మేరకు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ఫిన్‌టెక్ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పర్చుకున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం 15 సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, మరి కొద్ది రోజుల్లో మరో 10 సంస్థలూ కలుస్తాయని చెప్పింది.

తిండి కోసం దిక్కులు!

దిగుమతులు లేనిదే గడవని దుస్థితికి దేశం
అమాంతం పడిపోయిన గోధుమల ఉత్పత్తి

- 16 ఏండ్ల కనిష్ఠానికి నిల్వలు
- ఆరేండ్ల తర్వాత దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్?
- నిల్వలున్నాయని ఇటీవల కేంద్రం అబద్ధాలు
- ఎన్నికల్లో లబ్ధికి ప్రజల జీవితాలతో చెలగాటం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): యావత్తు ప్రపంచ దేశాలకు ఆహారాన్ని ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకుపోతామని గప్పాలు కొట్టిన కేంద్రంలోని మోదీ సర్కారు గడిచిన పదేండ్లలో దేశాన్ని ఆకలి భారతంగా మార్చింది. తిండి కోసం విదేశాల వైపు దీనంగా చూసే దుస్థితికి తీసుకొచ్చింది. నిన్న మొన్నటివరకూ ఉల్లి, కందిపప్పు, వంట నూనె, టమాట, చక్కెర వంటి నిత్యావసరాల కోసం దిగుమతులను ఆశ్రయించిన భారత్.. ఇప్పుడు గోధుమల కోసమూ దిక్కులు చూసే దుస్థితికి దిగజారింది. ఆరేండ్ల తర్వాత గోధుమ దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుండటమే దీనికి నిదర్శనం.

నిల్వలు అధఃపాతాళానికి

గోధుమల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు అదే గోధుమల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన దురవస్థ దాపురించింది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వెరసి హర్యానా, పంజాబ్, యూపీ, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో గోధుమల దిగుబడి భారీగా తగ్గినట్టు పారిశ్రామికవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది 112 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర గోధుమ ఉత్పత్తి ఉంటుందని కేంద్రం అంచనా వేసినప్పటికీ, 6.25 శాతం మేర ఉత్పత్తి పడిపోనున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో ఏప్రిల్‌నాటికి గోదాముల్లో నిల్వలు 7.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు క్షీణించాయి. ఇది 16 ఏండ్లలోనే కనిష్ఠం. దీంతో రష్యా వంటి దేశాల నుంచి ఆరేండ్ల తర్వాత గోధుమలు దిగుమతి చేసుకోవాలని కేంద్రం యోచిస్తున్నది. ఈ క్రమంలో గోధుమల దిగుమతులపై ఉన్న 40 శాతం సుంకాన్ని ఎత్తివేయాలనుకొంటున్నది. ఈ మేరకు జూన్‌లో నిర్ణయం ఉండొచ్చని అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' ఓ కథనంలో వెల్లడించింది.

నిల్వలు ఉన్నాయని ఏమార్చి..

దేశీయంగా నిల్వలు తగ్గిపోతుండటంతో 2022లో గోధుమల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. అయితే, కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ చర్యలను మాత్రం చేపట్టలేదు. దీంతో గోధుమల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సేకరించే గోధుమల నిల్వలూ పడిపోయాయి. ఇదే విషయమై గత జనవరిలో వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే, ఎఫ్‌సీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. స్థానిక వ్యాపారులకు 6 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను కేంద్రం సరఫరా చేసిందని, నిల్వలు లేకుంటే ఇదెలా సాధ్యమని ఉదహరించారు. విదేశాల నుంచి దిగుమతులు దిగుమతి చేసుకొనే అవసరమే లేదని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ప్రయోజనం కోసమే..

నిజానికి జనవరి 1నాటికి గోదాముల్లో 16.47 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలు మాత్రమే ఉన్నాయి. ఈ స్థాయిలో నిల్వలు పడిపోతే దేశంలో ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉన్నది. దీంతో అప్పుడే గోధుమల దిగుమతులు మొదలుపెట్టాలి. అయితే, విదేశాల నుంచి ఎక్కువ ఖర్చుపెట్టి గోధుమలను దిగుమతి చేసుకొంటే రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవ్వొచ్చని, ఇది ఎన్నికలపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని కేంద్రంలోని బీజేపీ సర్కారు భావించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకనే సరిపడా నిల్వలు ఉన్నట్టు, దిగుమతులు అవసరమే లేదని కేంద్రమంత్రులతో అబద్ధాలు వల్లెవేయించిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కొరతను నివారించడానికి దిగుమతులకు తలుపులు బార్లా తెరువబోతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా కేంద్ర సర్కారుకు ముందుచూపు లేకపోవడంతోనే దేశంలో గోధుమల కొరత ఏర్పడిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

నెట్‌ఫ్లిక్స్‌తో వొడాఫోన్ ఐడియా జట్టు

న్యూఢిల్లీ, మే 30: టెలికం సేవల సంస్థ వొడాఫోన్ ఐడియా..వీడియో స్ట్రీమింగ్ సేవల సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన కస్టమర్లకు ఎంటర్‌టైన్‌మెంట్ సేవల పరిధిని మరింత విస్తరించడంలో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రెండు సరికొత్త ప్రీ-పెయిడ్ ప్లాన్లను సైతం ఆవిష్కరించబోతున్నది. యూజర్లు తమకు నచ్చిన మొబైల్, టెలివిజన్ లేదా ట్యాబ్లెట్‌లో ఈ సరికొత్త స్ట్రీమింగ్ సదుపాయం పొందవచ్చునని తెలిపింది. ఇందుకోసం వొడాఫోన్ ఐడియా రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను ఆవిష్కరించింది. ఈ ప్లాన్లలో అన్‌లిమిటెడ్ కాల్స్, డాటా పొందవచ్చునని తెలిపింది. దీంట్లో 70 రోజుల కాలపరిమితి కలిగిన రూ.999 ప్లాన్‌లో రోజుకు 1.5 జీబీ డాటాతో పాటు 100 ఎస్ఎంఎస్/రోజుకు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ చేసుకోవచ్చును. అలాగే 84 రోజుల కాలపరిమితితో విడుదల చేసిన ప్లాన్‌లో రోజుకు 2.5 జీబీ డాటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్, నెట్‌ఫ్లిక్స్ బేసిస్(టీవీ లేదా మొబైల్) పొందవచ్చును. ఈ ప్లాన్ చార్జీ రూ.1,399గా నిర్ణయించింది.

బ్యాంకింగ్ మోసాలు పెరిగాయ్

గత ఆర్థిక సంవత్సరం 47 శాతం ఎక్కువయ్యాయని ప్రకటించిన ఆర్బీఐ
రూ.78,213 కోట్లకు బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు

ముంబై, మే 30: ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ బ్యాంకింగ్ రంగంలో మోసాలు 46.7 శాతం పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. గురువారం విడుదల చేసిన రిజర్వ్ బ్యాంక్ వార్షిక నివేదిక ప్రకారం నిరుడు ఏప్రిల్ మొదలు ఈ మార్చి చివరిదాకా మొత్తం 36,075 మోసాలు జరిగాయి. అంతకుముందు ఏడాది కాలంలో 13,564 మోసాలే నమోదయ్యాయి. అయితే ఈసారి ఈ మోసాల విలువ రూ.13,930 కోట్లుగానే ఉన్నది. 2022-23లో మాత్రం రూ.26,127 కోట్లుగా ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలు చెప్తున్నాయి. ఇక ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఎక్కువగా చిన్నపాటి కార్డ్/ఇంటర్నెట్ మోసాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మాత్రం లోన్ పోర్ట్‌ఫోలియోల్లోనే అధికంగా మోసాలకు పాల్పడ్డారు.



రూ.78,213 కోట్లకు..

ఈ మార్చి ఆఖరు నాటికి బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.78,213 కోట్లకు పెరిగినట్టు ఆర్బీఐ తమ తాజా నివేదికలో తెలిపింది. ఏడాది క్రితం రూ.62,225 కోట్లేనన్న ఆర్బీఐ.. గత ఆర్థిక సంవత్సరం 26 శాతం పెరిగినట్టు చెప్పింది. సహకార బ్యాంకులుసహా దేశంలోని అన్ని బ్యాంకుల్లో పదేండ్లు, ఆపై కాలంగా ఖాతాదారులు తమ ఖాతాల నుంచి తీసుకోని డిపాజిట్లే ఇవన్నీ. వీటిని ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తున్నారు. కాగా, సదరు డిపాజిట్ల సెటిల్మెంట్ల కోసం వాటికి చెందిన ఖాతాదారులను లేదా వారి వారసులు, నామినీలను వెతకాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచిస్తున్నది. ఇక గత ఆర్థిక సంవత్సరం ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 11.08 శాతం పెరిగి రూ.70.47 లక్షల కోట్లకు చేరిందని, అందుకే కేంద్ర ప్రభుత్వానికి మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్లను డివిడెండ్‌గా ప్రకటించామని ఆర్బీఐ తెలిపింది.

ఆర్బీఐ వార్షిక నివేదిక ముఖ్యాంశాలు

- ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 7 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- గత ఆర్థిక సంవత్సరం రూ.27,000 కోట్ల సావరిన్ గోల్డ్ బాండ్లను కొన్నమదుపరులు.
- రిజర్వ్ బ్యాంక్ వద్ద 822.10 మెట్రిక్ టన్నుల బంగారం.
- ప్రధాన ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు. ఇదే జరిగితే ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం ఉంటుంది.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న కరెన్సీలో 86.5 శాతానికి చేరిన రూ.500 నోట్ల వాటా.
- విదేశాల్లో రూపీ అకౌంట్లను తెరిచేందుకు అనుమతి.

దేశంలోకి తగ్గిన ఎఫ్‌డీఐలు

గత ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతం క్షీణత

న్యూఢిల్లీ, మే 30: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి 44.42 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు మాత్రమే వచ్చాయి. 2022-23లో వచ్చిన 46.03 బిలియన్ డాలర్లతో పోలిస్తే 3.49 శాతం తగ్గాయి. సేవలు, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్, టెలికం, ఆటో, ఫార్మా రంగాల్లోకి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ జనవరి-మార్చి త్రైమాసికంలో ఎఫ్‌డీఐలు మాత్రం ఏడాది ప్రాతిపదికన 33.4 శాతం ఎగబాకి 12.38 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏడాది క్రితం ఇది 9.28 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అలాగే ఈక్విటీలు, ఇతర క్యాపిటల్ రంగాల్లోకి వచ్చే ఎఫ్‌డీఐలు కూడా 71.35 బిలియన్ డాలర్ల నుంచి 70.95 బిలియన్ డాలర్లకు దిగొచ్చాయి.

- గడిచిన ఆర్థిక సంవత్సరంలో మారిషస్, సింగపూర్, అమెరికా, బ్రిటన్, యూఏఈ, జర్మనీ దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గుముఖం పట్టగా.. నెదర్లాండ్, జపాన్ దేశాల నుంచి పెరిగాయి.
- రంగాలవారీగా చూస్తే సర్వీసులు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్, ట్రేడింగ్, టెలికమ్యూనికేషన్, ఆటోమొబైల్, ఫార్మా, కెమికల్స్ రంగాల్లో తగ్గుముఖం పట్టాయి. కానీ, నిర్మాణ, డెవలప్‌మెంట్, పవర్ రంగాలు అత్యధికంగా ఎఫ్‌డీఐలను ఆకట్టుకున్నాయి.
- రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్ర అత్యధికంగా 15.1 బిలియన్ డాలర్ల విలువైన ఎఫ్‌డీఐలను ఆకట్టుకున్నది. అలాగే గుజరాత్‌లోకి 7.3 బిలియన్ డాలర్లు రాగా, తమిళనాడు, తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా అత్యధికంగా ఆకట్టుకున్నాయి. కానీ, కర్ణాటక, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు తగ్గుముఖం పట్టాయి.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై మరో ట్విస్ట్

- ఏపీ సీఈవో వివాదాస్పద మెమో వెనక్కి
- హైకోర్టుకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్/ విజయవాడ, మే 30 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఈవో ముకేశ్‌కుమార్ మీనా జారీచేసిన వివాదాస్పద మెమోను ఉపసంహరించుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ హైకోర్టుకు గురువారం తెలిపింది. మీనా జారీచేసిన మెమోకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ఉండగానే, ఆ మెమోను ఎన్నికల సంఘం వెనక్కి తీసుకోవడం గమనార్హం. దీనిపై గురువారం హైడ్రామా నడిచింది. వాస్తవానికి, పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని 2023 జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. కానీ, ఇందుకు భిన్నంగా ఏపీలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా ఈ నెల 25, 27 తేదీల్లో జారీచేసిన ఉత్తర్వులు రాజకీయ దుమారం సృష్టించాయి. ఈ ఉత్తర్వులపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైఎస్సార్సీపీ నాయకుడు ఎస్ నిరంజన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఏపీ సీఈవో మీనా జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం సమీక్షించి, సముచిత నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై హైకోర్టు గురువారం అత్యవసరంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ తరపున సీనియర్ అడ్వొకేట్ పీ వీరారెడ్డి, న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదిస్తూ.. టీడీపీకి అనుకూలంగా ఏపీ సీఈవో మార్గదర్శకాలను సవరించారని కోర్టు దృష్టికి తెచ్చారు. దేశంలో ఎక్కడా లేని నిబంధనలు ఏపీలో అమలుచేస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు. 2023 జూలైలో జారీ చేసిన మార్గదర్శకాలను యథాతథంగా అమలు చేయాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, ఆ అధికారి హోదా గురించి పెన్నుతో రాసినా అనుమతించాలంటూ సీఈవో జారీ చేసిన మెమోను రద్దు చేయాలని కోరారు. సంతకం ఉండి, పేరు, హోదా, సీలు లేకపోయినా పోస్టల్ బ్యాలెట్‌ను కౌంటింగ్ సమయంలో ఆమోదించడం ఈసీ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఈసీ తరపున సీనియర్ అడ్వొకేట్ అవినాశ్ దేశాయ్ వాదిస్తూ.. ఈ నెల 25న జారీ చేసిన మెమోలోని రెండో పేరాను రద్దుచేస్తున్నట్టు తెలిపారు. ఈ పేరాకు అనుగుణంగా ఈ నెల 27న జారీ చేసిన మెమోను కూడా పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. ఈ దశలో తదుపరి విచారణను హైకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. ఆ తరువాత కొద్దిసేపటికి వైసీపీ సీనియర్ లాయర్ వీరారెడ్డి తిరిగి కోర్టులోకి వచ్చి, ఈసీ తాజాగా జారీచేసిన ఉత్తర్వులను కూడా సవాల్ చేస్తూ సవరణ పిటిషన్ దాఖలు చేసినట్టు చెప్పారు. దీనిపై గురువారం రాత్రి 9 గంటలు దాటిన తరువాత డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. సవరణ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. ఇదే సమయంలో వైసీపీ ప్రధాన పిటిషన్‌లో టీడీపీ దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించే విషయంపై కూడా బెంచ్ చర్చించింది. వైసీపీ సవరణ పిటిషన్‌కు అనుగుణంగా ఇంప్లీడ్ పిటిషన్‌లో కూడా సవరణలు చేయాలని టీడీపీని ఆదేశించింది. అన్ని వ్యాజ్యాలపై శుక్రవారం విచారణ జరిపేందుకు నిరాకరించింది. దీనిపై సీజే నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నది. అవసరమైతే హౌస్‌మోషన్ విచారణ కోరవచ్చునని సూచించింది.

ఆర్థిక అక్షరాస్యతలో భారత్‌కు 73వ స్థానం

24 శాతం కంటే తక్కువగా ఆర్థిక అక్షరాస్యులు • ఫార్చ్యూన్ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు మణి పవిత్ర వెల్లడి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ సర్వే ప్రకారం మన దేశ జనాభాలో 77% అక్షరాస్యులు ఉన్నప్పటికీ, అందులో 24% కంటే తక్కువమంది ఆర్థిక అక్షరాస్యులు ఉన్నట్టు ఫార్చ్యూన్ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు, ప్రముఖ ఫైనాన్స్ మెంటర్ డాక్టర్ మణిపవిత్ర తెలిపారు. యుక్త వయస్కుల్లో 17% మంది మాత్రమే ఆర్థిక అక్షరాస్యులు ఉన్నారని వెల్లడించారు. దేశం 24% ఆర్థిక అక్షరాస్యత రేటుతో 144 దేశాలలో 73వ స్థానంలో ఉన్నదని, ఆర్థిక పరిజ్ఞానం, అవగాహన లేకపోవటం వల్ల మెజార్టీ భారతీయులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ కోసం ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఎంట్రీల స్వీకరణకు జూలై 31 చివరి తేదీ అని, షార్ట్‌ఫిల్మ్ వీడియోలను fortuneacademyhub@gmail.com కు మెయిల్ చేయాలని, 9848042020ను సంప్రదించాలన్నారు.

అమెరికాలో భద్రాద్రి ఆలయం

ఖైరతాబాద్, మే 30: తెలంగాణలోని భద్రాచలం శ్రీసీతారామ దేవస్థానాన్ని పోలిన ఆలయం అమెరికాలో నిర్మించనున్నారు. శ్రీరామ్ సంస్థాన్ ఇన్‌కార్పొరేటెడ్ ఆలయ నిర్మాణానికి అంకురార్పణ చేయబోతున్నది. దాతల వివరాలు రూ.250 కోట్లతో ఆలయాన్ని నిర్మించనున్నారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థాన్ చైర్మన్ పద్మనాభాచార్యులు వివరాలను వెల్లడించారు. 2019లో యూఎస్ఏలోని అట్లాంట హైవే వద్ద 33ఎకరాల విస్తీర్ణంలో ఆలయం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆగస్టు 17న ప్రత్యేక విమానంలో ఆయోధ్య నుంచి ఖగోళ యాత్ర ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 17 నాటికి భారతదేశానికి చేరుకొని భద్రాచలంలో ముగిస్తామని తెలిపారు. ఆయా దేశాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 2025 శ్రీరామనవమి నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఏపీలోని ఆళ్లగడ్డలో ప్రముఖ శిల్పిరత్న డీ రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో 200 మంది శిల్ప కళాకారులు, 15 మంది ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు నిర్విరామంగా పని చేస్తున్నట్టు తెలిపారు. సంస్థాన్ ప్రతినిధులు జాడ కాశీ విశ్వనాథ శర్మ, ఎం సంతోష్ శర్మ పాల్గొన్నారు.

మరో ఆరేండ్లలో సునామీకి అడ్డుకట్ట!

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): సునామీ సృష్టించే బీభత్సానికి బ్రేకులు వేసే వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎగిసిపడే రాకాసి అలలను దీటుగా ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ ఆరేండ్లలో సిద్ధం కానున్నది. ఈ మేరకు ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్), ది యూనివర్సిటీ కాలేజీ లండన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. 2030 నాటికి సునామీ ముప్పు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు.

'గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి'

హిమాయత్‌నగర్, మే 30 : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిత్యం సేవలందిస్తున్న గ్రామీణ వైద్యుల పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం హైదరాబాద్ నారాయణగూడలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే గ్రామీణ వైద్యులకు గుర్తిం పు, శిక్షణ ఇవ్వకుండానే దాడులు చేయడం మొదలుపెట్టిందని మండిపడ్డారు. గ్రామీణ వైద్యులు... రోగులకు ప్రాథమికంగా చికిత్స అందించి కాపాడుతారే తప్ప వారికి హాని కల్గించారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ వైద్యులపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

1 నుంచి డ్రగ్స్‌పై నజర్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ మూలాలను చిత్తు చేయడమే లక్ష్యంగా జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నార్కోటిక్ బ్యూరోతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా సోదాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. నాలుగున్నర నెలల్లో 411 ఎన్డీపీఎస్ కేసులను నమోదు చేసి, 595 మందిని అరెస్టు చేసింది.

లోగో మార్చుకున్న టీఎస్ఎస్పీ

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ) బెటాలియన్స్ తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) బెటాలియన్స్‌గా అధికారిక లోగోను మార్చుకుంది. ఈ మేరకు గురువారం టీజీఎస్పీ డీజీ స్వాతిలక్రా ఎక్స్ వేదికగా తమ లోగోను షేర్ చేశారు. టీఎస్ఎస్పీని ఇక నుంచి టీజీఎస్పీ బెటాలియన్స్‌గా పిలువాలని సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
మీ సమీప రైల్వే స్టేషన్ లేదా www.scr.indianrailways.gov.in పై మాదవమ్మను.
ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)
PUB/0515
దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.01, **NIT No.** E29CTrDSC_21_2024-25, తేది: 28-05-2024. **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్‌పై బల్హార్షా-మాకుడి సెక్షన్ (మూడు లైన్లు)లో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులతో 2x25 KV AT ఫీడింగ్ సిస్టమ్‌కు ప్రస్తుతం ఉన్న 1x25KV సిస్టమ్ OHE అప్‌గ్రేడేషన్ యొక్క డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పని చేయించుట. **అంచనా వ్యయం:** రూ. 47,47,14,873.86/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ. 25,23,600/-, **డాక్యుమెంట్ ధ